క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న బాలప్ప

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన మాజీ ఉప సర్పంచ్ సిద్దాల బాలప్ప కుమారుడు సిద్దాల శ్రీకాంత్ 12వ వర్ధంతి సందర్భంగా బుధవారం మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలప్ప మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవా మార్గంలో నడవాలన్నారు. అనంతరం నాదర్‌గుల్‌లోని మాతృదేవో అనాథ ఆశ్రమంలో అన్నదానం చేసినట్లు తెలిపారు.

పోలింగ్ చిట్టీల పంపిణీ



తుక్కుగూడలో ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుక్కుగూడ: ఈ నెల13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకునే విధంగా అధికారులు పోలింగ్ చిట్టీలను పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ సిబ్బంది ఇంటింటికి తిరిగి ఓటర్‌స్లిప్పులను అందిస్తున్నారు. వార్డులు వారిగా ఓటర్ జాబితానుసరించి పోలింగ్ కేంద్రాల వారిగా చిట్టీలను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించండి



శ్రీరాం కాలనీలో ప్రచారంలో కపిల్ గౌడ్

పహాడీషరీఫ్: ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనే దేశ ప్రజలకు రక్షణ ఉంటుందని బీజేపీ జల్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.వివేకానంద (కపిల్) గౌడ్ అన్నారు. శ్రీరాం కాలనీలో కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. కమలం గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో 400పైగా ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించనుందన్నారు. అధిక స్థానాల్లో సీట్లు సాధించినప్పుడే స్థిరమైన పాలన అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అవినీతి కాంగ్రెస్‌ను ఈ సారి చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు.

కార్మికులందరూ కలిసి పనిచేయాలి

మొయినాబాద్‌రూరల్: భవన నిర్మాణ కార్మికులు ఐకమత్యంగా ఉండి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బొర్రా శంకర్, ప్రధాన కార్యదర్శి రవిసాగర్‌లు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వీరన్నపేట్ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పనిచేస్తున్న సెంట్రింగ్, భవన నిర్మాణ కార్మికులు ఎలాంటి సమస్యలకు లోనుకాకూడదని తెలిపారు. సెంట్రింగ్ యూనియన్‌లో ఉన్న సభ్యులందరూ ఎలాంటి సమస్యలు ఉన్నా సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. సంఘంలో సభ్యత్వం తీసుకున్న వారందరికి ఐడీ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. మనందరం యూనిటీగా ఉంటేనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దర్శన్‌సాగర్, కోశాధికారి మౌనకర్‌సాగర్, బాలుసాగర్, ఉపాధ్యక్షులు రామిరెడ్డి, బాబుసాగర్, లక్ష్మీనారాయణ, సతీశ్‌సాగర్, పరమేశ్, మల్లేశ్‌సాగర్, యాదయ్య, పాల్గొన్నారు.

కేటీఆర్ రోడ్‌షోకు తరలిన నేతలు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోకు ఆమనగల్లు పట్టణం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాలలో కల్వకుర్తికి తరలివెళ్లారు. తరలిన వారిలో మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుమార్, బీఆర్ఎస్ మైనార్టీ విభాగం జిల్లా నాయకులు సయ్యద్ ఖలీల్, నాయకులు రఘు, శ్రీను, పాల్గొన్నారు.

'రెవెన్యూ కార్యాలయం' బడంగ్‌పేట్‌లోకి!

సరూర్‌నగర్ మండలం రెండుగా విభజన

- 13 గ్రామాలతో బాలాపూర్ ఏర్పాటు
- పాతభవనంలోనే రెవెన్యూ కార్యాలయం సిద్ధం
- శరవేగంగా పనులు చేయిస్తున్న అధికారులు



పాత మున్సిపల్ కార్పొరేషన్ భవనానికి రంగులు వేస్తున్న కార్మికులు

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలంలోని రెవెన్యూ కార్యాలయం బడంగ్‌పేట పాత మున్సిపల్ కార్పొరేషన్‌లోకి రాబోతుందా? అవుననే అంటున్నారు అధికారులు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించినప్పటినుంచి సరూర్‌నగర్ మండలాన్ని రెండుగా విభజించారు. 13 గ్రామాలతో బాలాపూర్ మండల పరిధిలోకి ఏర్పాటు చేశారు. బాలాపూర్‌తో పాటు నాదర్‌గుల్, అల్మాస్‌గూడ, వెంకటాపూర్, గుర్రంగూడ, మల్లాపూర్, బడంగ్‌పేట్, కమ్మగూడ, కుర్మల్‌గూడ, మామిడిపల్లితో పాటు బాలాపూర్‌లోని మరికొంత రెవెన్యూను, అలాగే మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్, జిల్లెలగూడ, బాలాపూర్ మండలంలో చేర్చారు. అప్పటికప్పుడే తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో గ్రామ పంచాయతీలుగా ఉన్నా ఈ గ్రామాలకు బాలాపూర్ గ్రామ పంచాయతీని మండల కేంద్రంగా ఏర్పాటు చేసుకున్నారు. 2014 నుంచి నేటి వరకు బాలాపూర్‌లోనే రెవెన్యూ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవలే బడంగ్‌పేట గ్రామ పంచాయతీని అభివృద్ధిలో భాగంగా నగర పంచాయతీగా, అటు తర్వాత మున్సిపల్‌గా కార్పొరేషన్‌గా మార్చుకుంటూ అందులోనే కొనసాగించారు. తదనంతరం దావుత్‌ఖాన్‌గూడలో అతిపెద్ద కార్పొరేషన్ సొంత భవనాన్ని నిర్మించుకుని అందులోకి మారారు. గత ఆరు నెలల నుంచి పాత భవనం ఖాళీగా ఉండడంతో మెదట ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌ని, వాటర్‌వర్క్స్ ఆఫీసు అని, ట్రాన్స్‌కో కార్యాలయమని, రెవెన్యూ కార్యాలయమని పలు తీర్మానాలు చేసినప్పటికీ చివరకు ఈ భవనాన్నే రెవెన్యూ కార్యాలయానికి కేటాయించినట్లు తెలుస్తుంది. గత మూడు రోజులుగా పాత మున్సిపల్ కార్పొరేషన్ భవనానికి శరవేగంగా పనులు చేయించడంతో పాటు రంగులు వేయించే పనిలో అధికారులు ఉన్నారు. వారం పది రోజుల్లో బాలాపూర్‌లోని రెవెన్యూ కార్యాలయం బడంగ్‌పేటకు మారనుంది.

స్వాగతిస్తున్నాం...



బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఏర్పాటు అయినప్పటినుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు బడంగ్‌పేట్ పరిధిలోనే ఉన్నాయి. ఒక్క రెవెన్యూ తప్పా. పేరు బాలాపూర్ అయినప్పటికీ బడంగ్‌పేట్‌లోనే ఏర్పాటు చేస్తే బాగుంటుందని మొదటి నుంచి కోరుకుంటున్నాం. రాకపోకలు అందుబాటులో ఉన్న బడంగ్‌పేట్ పాత మున్సిపల్ కార్పొరేషన్‌లోకి తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం.

– భీమిడి స్వప్న, కార్పొరేటర్



మీర్‌పేట: జిల్లెలగూడ గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించండి

మీర్‌పేట: చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా బుధవారం మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడ గ్రామంలో 41వ డివిజన్ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిందన్నారు. పేదల అభ్యున్నతికోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, గోపి యాదవ్, శేఖర్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్: కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు చేవేళ్ల పార్లమెంట్‌తోపాటు మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి మలుపని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 30వ డివిజన్ కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అరవబస్తీ, ఎంసీఆర్ కాలనీ, రోమా–2, సుమ ప్యారడైజ్ తదితర కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలు, డానియల్, భీమా, నర్రిగౌడ్, చిత్రం సాయి, గౌర సాయికుమార్, గుర్రం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సరూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: బీఆర్ఎస్‌కి ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని సరూర్‌నగర్ డివిజన్ నాయకుడు ఆకుల అరవింద్ తెలిపారు. ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా బుధవారం డివిజన్‌లోని పలు కాలనీల్లో గడప గడపకు తిరిగి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటూరి అంకిరెడ్డి, దర్పల్లి అశోక్, లోకసాని కొండల్‌రెడ్డి, పందుల రాజు, పోలె సుధామా పాల్గొన్నారు.

వర్షం.. మిగిల్చిన నష్టం

- మార్కెట్‌యార్డుల్లో తడిసిన ధాన్యం
- ఈదురుగాలులకు నేలరాలిన మామిడి
- పలుచోట్ల విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు



షాద్‌నగర్ మార్కెట్‌యార్డులో వర్షం నీటిలో ధాన్యం బస్తాలు



తడిసిన ధాన్యాన్ని చాటతో ఆరబోస్తున్న మహిళా రైతు

షాద్‌నగర్: రెక్కలు ముక్కలు చేసుకొని రైతులు ఆరుగాలం కష్టపడ్డారు.. వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు సాగు చేశారు. పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే అకాలంగా కురిసిన వర్షం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. షాద్‌నగర్ మార్కెట్‌యార్డులో అమ్ముకునేందుకు తీసుకొచ్చిన సుమారు 20వేల బస్తాల ధాన్యం వర్షానికి తడిసిపోయింది.

మార్కెట్‌కు భారీగా వరిధాన్యం

షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన రైతులే కాకుండా షాబాద్, నవాబ్‌పేట్, బాలానగర్, తదితర మండలాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చారు. దీంతో మార్కెట్ ఆవరణలో ఎక్కడ చూసిన ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. సుమారు 30వేలకు పైగా ధాన్యం బస్తాలతో పాటుగా ధాన్యం రాశులు మార్కెట్‌లో ఉన్నాయి.

రైతుల ఆశలపై నీళ్లు

ఈదులగాలులతో మంగళవారం సాయంత్రం భారీవర్షం రావడంతో మార్కెట్‌లో ఉన్న రైతులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ధాన్యం కుప్పలు, బస్తాలపై కప్పేందుకు టార్పాలిన్లు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. చాలామంది రైతులు ధాన్యం తడిసిపోయికుండా కాపాడుకునేందుకు ప్రయత్నించారు. అయినా భారీ వర్షం రావడంతో ధాన్యం తడిసిపోయింది

ప్రభుత్వం ఆదుకోవాలి

తమకున్న సుమారు ఐదెకరాల్లో వరిసాగు చేశాం. మూడు ట్రాక్టర్ల ధాన్యాన్ని మార్కెట్‌కు అమ్మేందుకు తీసుకొచ్చాం. వర్షం కారణంగా ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

– భారతమ్మ, విఠ్యాల, షాద్‌నగర్

టార్పాలిన్లు ఇవ్వలేదు

మార్కెట్‌కు 42 బస్తాల ధాన్యాన్ని అమ్మేందుకు తీసుకొచ్చాం. అయితే వర్షం కురుస్తుండటంతో మార్కెట్‌లో ఉన్న సిబ్బందిని టార్పాలిన్లు అడిగినా ఇవ్వలేదు. దీంతో ధాన్యం బస్తాలు పూర్తిగా తడిసిపోయాయి.

– మామిడి భీమయ్య, ఎల్గొండగూడ, షాబాద్

సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి
- బీజేపీతో రిజర్వేషన్లకు ముప్పు
- ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం



మహేశ్వరం: హర్షగూడలో గిరిజన మహిళలతో కలిసి జొన్న రొట్టె చేస్తున్న తీగల అనితారెడ్డి



నేదునూరులో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ హర్షగూడ గ్రామాల్లో ఆమె స్థానిక నాయకులతో కలిసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తీగల అనితారెడ్డి మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల అనంతరం ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేసితీరుతుందన్నారు. బీజేపీకి ఓటేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తారన్నారు. బీజేపీ నేతలే ఎన్నికల్లో మెజార్టీ ఎంపీ సీట్లు వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లు మారుస్తామని అంటున్నారని గుర్తుచేశారు. అయోధ్య ఆలయం, రాముడు, మైనార్టీలు పేరుతోనే ఓట్లు దండుకునే కుట్రలు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ అన్ని వర్గాలు, మతాలను సమాన భావంతో చూస్తుందన్నారు. దేశంలో ఇండియా కూటమి మెజార్టీ ఎంపీ సీట్లు సాధించి అధికారంలోకి రాబోతుందన్నారు. అమీర్‌పేట్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు మల్ల బాల్‌రాజ్ కాంగ్రెస్‌లో చేరారు. హర్షగూడలో అనితారెడ్డి గిరిజన మహిళలతో కలిసి జొన్న రొట్టె చేసి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాండు నాయక్, ఆవుల యాదయ్య, చాకలి యాదయ్య, ఆవుల రఘుపతి, ఐతాబాద్ రాజేందర్, చంద్రమోహన్, కేజే. ప్రసాద్, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రవీణ్, భాస్కర్, జగదీశ్ పలువురు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని నేదునూరులో కోఆర్డీనేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు సోలిపేట అమరేందర్‌రెడ్డి, ఇంద్రకంటి రాకేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, సమైక్యం ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, వరికుప్పల బాబు, ఎ.దర్శన్, ఎండీ పర్వేజ్, ఎం.సద్దాం, ఎం.సోహైల్‌బేగ్, ఎ.సంజీవ, వెంకటయ్య, రవి, ఎం.మహేందర్, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గోగికర్ జానకీరామ్ అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఈ నెల13న జరగనున్న ఎంపీ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి చేవెళ్ల ఎంపీగా డాక్టర్ రంజిత్ రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

కమిషనర్ సత్యనారాయణ



ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తున్న సిబ్బంది

తుర్కయంజాల్ : ప్రజాస్వామ్యంలో మంచి నాయకులను ఎన్నుకోవడం కోసం ఓటు వజ్రాయుధంతో సమానమని మే నెల 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఇంజాపూర్‌లోని 14వ వార్డులో మున్సిపల్ సిబ్బందితో కలిసి ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటికి ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేశారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న టీఏ లక్ష్మారెడ్డి

కొందుర్గు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి సూచించారు. బుధవారం చౌదరిగూడ మండల కేంద్రంలో ఆయన ఓటు హక్కు ప్రాధాన్యతపై కూలీలకు అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉమ, కూలీలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పండి

పీసీసీ కార్యదర్శి యెల్మేటి అమరేందర్ రెడ్డి



కొత్తపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అమరేందర్ రెడ్డి

పహాడీషరీఫ్: దేశంలో విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పీసీసీ కార్యదర్శి యెల్మేటి అమరేందర్ రెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని కొత్తపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా మోడీ పాలనలో దేశం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. కేవలం కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచి పెడుతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలకు అడ్డు అదుపులేకపోవడంతో సామాన్యులకు బతుకు భారంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు అహ్మద్ బామ్, జగదీష్ గౌడ్, జగన్ గౌడ్, వంగేటి మధుసూదన్ రెడ్డి, ఆంజనేయులు, పాషా, మహబూబ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మామిడితోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: అకాలంగా కురిసిన భారీ వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో దెబ్బతిన్న మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిపంట, మామిడి తోటల రైతులు అధికంగా నష్టపోయారన్నారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాలు పూర్తిస్థాయిలో సేకరిస్తున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం, అన్నదాతలకు తాము ఎల్లప్పుడూ అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ముబారక్, రాయికల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం: తడకల రాజును కండువా కప్పి ఆహ్వానిస్తున్న కేఎల్ఆర్




కందుకూరు: కాంగ్రెస్‌లో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ తదితరులు

మహేశ్వరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్‌కి సీనియర్ నాయకులు తడకల రాజు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ఆరు గ్యారంటీలకు ఆకర్శితులై చేరుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రవాపు ఇజ్రాయేల్, ఇంద్రకంటి నర్సింహ గౌడ్, ఇంద్రకంటి వెంకటేశ్ గౌడ్, అవ కొమురయ్య, బండ నర్సింహ, సోమేశ్, మురళీ పలువురు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: దావూద్‌గూడ, జైత్వారం గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. దావూద్‌గూడ మాజీ సర్పంచ్ విజయరాజునాయక్, మాజీ ఉప సర్పంచ్ ధన్‌సింగ్‌తో పాటు ఆ గ్రామానికి చెందిన నాయకులు, జైత్వారం నాయకులు బైరు శ్రీపాల్‌రెడ్డి, ఓర్సు శంకర్, సాయిబాబా, గుల్వీ శంకర్, బాలరాజ్, ఎం ఆంజనేయులు, రాజు, డి.హీరామన్‌నాయక్, ప్రభాకర్, కృష్ణ, యాదగిరి, డి.రవి, ఎస్.హన్మంత్, ఆర్.మోహన్, ఎన్.నవీన్, సీతారాం, సాయి, శ్రీకాంత్, శివ, మున్యానాయక్ తదితరులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కేఎల్ఆర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సరికొండ మల్లేశ్, మాజీ మండల అధ్యక్షుడు ఎస్ కృష్ణనాయక్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, ఇ రాంచంద్రారెడ్డి, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, డి నర్సింహాచారి, ఎస్ వెంకట్రామ్‌రెడ్డి, సులేమాన్, ఎ పాండుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు'



మాట్లాడుతున్న సబితారెడ్డి, పక్కనే కాసాని

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చారని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి నియోజకవర్గ కేంద్రంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా కార్నర్ మీటింగ్, రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ కులాల హక్కుల సాధన కోసం కొట్లాడిన బడుగు, బలహీన వర్గాల నేత జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు చిలకమర్రి నర్సింహ, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అంబయ్య యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, హన్మగళ్ల చంద్రయ్య, నవీన్, రవి, థామస్‌రెడ్డి, లింగం, రాజు, శ్రీనివాస్, జాన్‌రెడ్డి, నర్సింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386